వర్షం.. రైతుల హర్షం

- ఖరీఫ్ వరికి ఊపిరి పోసిన వానలు
- కూరగాయల పంటలకు ఈ వర్షాలతో ఎంతో మేలు
- గంటి రైతుల్లో మాత్రం ఆందోళన

పరవాడ మండల పరిధిలో వ్యవసాయం వర్షాధారమే..! వరుణుడు కరుణిస్తేనే సాగు జరిగేది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌పై రైతులు పెద్దగా నమ్మకాలు పెట్టుకోలేకపోయారు. ఆరంభంలో కురిసిన వర్షాలకు వెదలు, నాట్లు వేసిన రైతులు.. ఆ తర్వాత చినుకు జాడ లేక భయపడ్డారు. బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలు రైతులకు హర్షాన్నిచ్చాయి. చెరువులు, జలాశయాల్లో నీరు చేరడంతో పంటల సాగుపై ధీమా పెంచాయి.

పరవాడ: వారం రోజుల ముందు వరకు మండల రైతుల్లో నెలకొన్న ఆందోళన తాజా వర్షాలకు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. నాట్లు పూర్తి చేసుకున్న పొలాల్లో పంట చేతికొస్తుందో.. లేదో..? నారుమడులు వృథా కావాల్సిందేనా? అనుకున్న రైతుల బెంగ తీర్చేలా వర్షాలు దంచికొట్టాయి. మండల పరిధిలోని చెరువులు, పంట పొలాల్లో పుష్కలంగా నీరు చేరి, ఈ ఏడాది పంటకు ఢోకా లేదన్న ధీమానిచ్చాయి. గంటి చేను వేసిన రైతులు మినహా, మండల రైతులంతా తాజా వర్షాలకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న పంటలకు ఊపిరి

మండలంలో స్వయంభూవరం, వెన్నెలపాలెం, రావాడ, వాడచీపురుపల్లి, తానాం, భర్నికం, ధర్మారాయుడుపేట, గొర్లివానిపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో వరి, కూరగాయలు, పెసలు, మినుములు, అలసందలు, నువ్వులు, గంటి, చోడి పంటలతో పాటు సరుగుడు, యూకలిప్టస్ ఎక్కువగా సాగు చేస్తుంటారు. గతంలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతాంగం వరి, గంటి, అపరాలు, నువ్వులు, కూరగాయల పంటలను వేశారు. వర్షాలు అనుకూలించక పలు చోట్ల వరి నాట్లను వేయలేకపోయారు. పలు చోట్ల వేసిన పంటలకు నీరందక ఎండిపోయే స్థితికి చేరాయి. ఇలాంటి దశలో కురిసిన భారీ వర్షాలు రైతుల్లో ఆనందాన్ని పెంచాయి. ఎండిపోతున్నాయనుకున్న పంటలకు ఊపిరిపోశాయి.


నిండుకుండలా పరవాడ పెద్ద చెరువు


స్వయంభూవరంలో పచ్చగా కళకళలాడుతున్న వరి చేలు

వరినాట్లు పూర్తి

అల్పపీడనం, వాయుగుండం కారణమేదైనా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో పుష్కలంగా నీరు చేరింది. దీంతో స్వయంభూవరంలో అసంపూర్తిగా నిలిచిన వరి నాట్లు పూర్తయ్యాయి. పరవాడ, భర్నికం, తానాం, రావాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో గత వర్షాలకు వేసిన వరి నాట్లకు ప్రస్తుత వర్షం ఊపిరి పోసింది. వర్షపు నీరు చేరడంతో పంట పొలాలు ఆకు పచ్చగా కళకళలాడుతున్నాయి. వెన్నెలపాలెం, తానాం, పరవాడ ప్రాంతాల్లో వేసిన వంగ, బీర, చిక్కుడు, బెండ వంటి కూరగాయల పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో పలుచోట్ల నాటిన సరుగుడు, యూకలిప్టస్ పంటలకు ఈ వర్షం అనేక విధాలుగా ఉపయోగపడింది. తొలకరి వర్షాల ఆధారంగా ముందుగా వేసిన గంటి పంట అనేక గ్రామాల్లో కోత దశకు వచ్చింది. ఈ సమయంలో కురుస్తున్న వర్షాలకు మొలకలు వచ్చేస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అది మినహా మండల రైతులంతా తాజా వర్షాలకు ఆనందంగానే ఉన్నారు.


సోమినాయుడుపాలెంలో ఏపుగా ఎదిగిన బెండ పంట


ధర్మారాయుడుపేటలో కోతకు సిద్ధంగా ఉన్న హైబ్రీడ్ గంటి చేను

మండలంలో ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం

పంట	విస్తీర్ణం హెక్టార్లలో
వరి	134
గంటి	96
పెసలు	13
మినుములు	17
అలసందలు	9
నువ్వులు	6
కూరగాయలు	147

పంట చేతికొస్తుందని నమ్మకం



పరవాడ గ్రామంలోని పెద్ద చెరువు కింద నాకున్న రెండెకరాల్లో వరి పంట వేశాను. గతంలో కురిసిన వర్షాలకు నాట్లు వేశాను. ఆ తర్వాత వర్షాల్లేక, పంటకు నీరందక ఇబ్బంది పడ్డాను. ఇంతలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు వరి పంటకు ఊపిరిపోశాయి. చెరువుల్లో నీరు చేరింది. వర్షాల పుణ్యమా అని వరి పంట ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది పంట చేతికొస్తుందన్న నమ్మకం ఉంది.

– కూండ్రపు సోమునాయుడు, రైతు, పరవాడ

ఆశాజనకంగా అపరాల సాగు



నేను అరెకరంలో వేసిన గంటి పంట వర్షాలకు కాస్త దెబ్బతింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో ఇబ్బంది నెలకొంది. వర్షం ఇంతటితో ఆగిపోతే గంటి పంట చేతికందుతుంది. లేనిపక్షంలో మొలకలు వచ్చే అవకాశం ఉందని భయపడుతున్నాం. తాజా వర్షాలు మా గ్రామంలో రైతులు వేసిన కూరగాయల పంటలు, అపరాల సాగుకు బాగా ఉపయోగపడతాయి.

– బండారు మోహన్‌రావు, రైతు, వెన్నెలపాలెం

పంటలకు లాభదాయకం



ప్రస్తుత వర్షాలు అన్ని రకాల పంటలకు లాభదాయకమే. మండలంలో నాలుగు రోజుల్లో సుమారు 120 మి.మీ. వర్షపాతం నమోదయింది. వరి, అపరాలు, బెండ, వంగ, చిక్కుడు పంటలకు ఈ వర్షాలు చాలా మేలు చేస్తాయి. గతంలో కురిసిన వర్షాలకు నాటిన సరుగుడు, యూకలిప్టస్ మొక్కలు బాగా ఎదిగేందుకు ప్రస్తుత వర్షాలు దోహదపడతాయి. ఖరీఫ్ వరి సాగుకూ ఈ వానలు అనుకూలమే.

– చంద్రావతి, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

మట్టి విగ్రహాలనే పూజిద్దాం


మట్టి విగ్రహాలను అందిస్తున్న శరగడం చినఅప్పలనాయుడు

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినాయక చవితి రోజున మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించాలని మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శరగడం చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రజలకు దాదాపు 2 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు మరో రెండు వేల విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డి శివ, శరగడం బుజ్జి, శరగడం గణేష్, మల్ల శ్రీను, రాజు, దొడ్డి నరసింగరావు, ఆళ్ల శ్రీ, కె.టి నాయుడు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఎన్నికల్లో ఎన్ఎస్‌డబ్ల్యూయూ గెలుపు


విజయం సాధించిన ఎన్ఎస్‌డబ్ల్యూయూ కార్యవర్గం

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రి గుర్తింపు యూనియన్‌కు గురువారం జరిగిన ఎన్నికల్లో ఎన్టీపీసీ సింహాద్రి వర్కర్స్ యూనియన్(ఎన్ఎస్‌డబ్ల్యూయూ) విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో బండారు శ్రీధర్‌నాయుడు అధ్యక్షుడిగా, గంప శంకరవర్మ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. మొత్తం 197 ఓట్లలో ఎన్టీపీసీ సింహాద్రి వర్కర్స్ యూనియన్‌కు 117 ఓట్లు రాగా, ప్రత్యర్థి వర్గానికి 80 ఓట్లు పోలయ్యాయి. 37 ఓట్ల తేడాతో ఎన్ఎస్‌డబ్ల్యూయూ గెలుపొందింది. విజేతలను పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అభినందించారు.


ఆరోగ్యకరమైన మాంసాన్నే విక్రయించాలి

- మాంసం విక్రయదారులతో పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణ కీర్తి

పరవాడ: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పరిశుభ్రమైన మాంసం విక్రయాలను జరపాలని పరవాడ పశు సంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణకీర్తి సూచించారు. స్థానిక పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో మాంసం విక్రయాలపై సంబంధిత విక్రయదారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్న మేకలు, గొర్రెలు, కోళ్లను మాత్రమే ప్రజలకు విక్రయించాలన్నారు. మాంసం విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మాంసం విక్రయాలకు ఉపయోగించే మేకలు, గొర్రెలు, కోళ్లను పంచాయతీ అధికారులు పరిశీలించి, ఆమోద ముద్ర వేశాకే వధించాలన్నారు. జంతు కళేబరాలను నివాసాలకు దూరంగా ఖననం చేయాలని సూచించారు. పరవాడ, రావాడ సర్పంచులు సిరపరపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు, పెదముషిడివాడ ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, పరవాడ ఎంపీడీవో హేమసుందరరావు, పశువైద్యాధికారులు సురేష్‌కుమార్, అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

పంజాబ్‌కు చెందిన లారీ డ్రైవర్ మృతి


గురుప్రీత్ సింగ్ (ఫైల్)

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఓ పరిశ్రమకు కెమికల్ లోడు తీసుకువచ్చిన పంజాబ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ గురుప్రీత్‌సింగ్(50) ఉన్నట్టుండి కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు కెమికల్ లోడుతో గురువారం ఉదయం జేఎన్ ఫార్మాసిటీకి వచ్చి, పార్కింగ్ ప్రదేశంలో వాహనాన్ని నిలిపాడు. ఆయన కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు, ఆయన మృతికి అనారోగ్య సమస్యలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు సూపర్‌వైజర్ జంగం రామారావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు వెల్లడించారు.

వైభవంగా భూలోకమాంబ పండగ


భూలోకమాంబను దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండల కేంద్రం పరవాడ గ్రామంలో కొలువుదీరిన భూలోకమాంబ అమ్మవారి పండగను గ్రామ ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిపారు. గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి పండగలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పైల పోతినాయుడు, బండారు రామారావు, పైల హరీష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

సింహాచలం: నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి వేపగుంట కూడలి వరకు నేత్రదానం విశిష్టతని తెలిపేలా ప్లకార్డుల ప్రదర్శన చేశారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు తెలిపారు. కార్నియా విభాగాధిపతి డాక్టర్ నస్రీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో డీజీఎం కె.వేణుగోపాల్, ఉద్యోగులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: విరాట్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నాయుడుతోట 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో విరాట్‌నగర్, దుర్గానగర్, గౌతమ్‌నగర్, సాయిమాధవ్‌నగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

గణపతి మట్టి విగ్రహాల పంపిణీ


వినాయక మట్టి ప్రతిమలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి

సింహాచలం: వినాయక చవితిని పురస్కరించుకుని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి 3 వేల మట్టి గణపతి ప్రతిమలను సింహపురికాలనీ ప్రధాన ఆర్చ్ వద్ద గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి నివాసితులు తరలివచ్చి ప్రతిమలను తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, సింహపురికాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేశ్వరరావు, పద్మావతినగర్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, సెక్రటరీ సత్యనారాయణ, లక్ష్మీనరసింహ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే ఉత్తమ సమాజ రూపకర్తలు

నియోజకవర్గ పరిధిలో ఊరూవాడా గురుపూజోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ విద్యా సంస్థల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులర్పించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన, నేర్పుతున్న గురువుల్ని విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులే ఉత్తమ సమాజానికి రూపకర్తలని కొనియాడారు.


సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి


గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి


ఎంఈవో సునీతను సత్కరిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు, ఉపాధ్యాయులు

- ఘనంగా గురుపూజోత్సవం
- ఊరూవాడా సర్వేపల్లికి ఘన నివాళి
- ఉపాధ్యాయుల్ని సత్కరించిన విద్యార్థులు


రవీంద్రభారతి స్కూల్లో గురుపూజోత్సవంలో పాల్గొన్న టీచర్లు


గ్రంథాలయంలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు


మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్, ప్రజాప్రతినిధుల నుంచి అందుకుంటున్న జగదీష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొని సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులే ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. మంచి, చెడులను వివరించి చెప్పి, సమాజంలో మన పాత్ర ఏమిటో తెలిపే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకుంటారని కొనియాడారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు ఎంఎల్ఎన్ మాస్టార్, తమ్మయ్య మాస్టార్లను ఈవో దుశ్శాలువాతో సత్కరించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవోలు ఆనంద్‌కుమార్, వీబీవీ రమణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- అడవివరం గ్రంథాలయంలో సర్వేపల్లి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎ.వి.నరసింహం సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భాగంగా విజయవాడ వరదల్లో మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. విశ్రాంత హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి, సింహాచలం దేవస్థానం విశ్రాంత సూపరింటెండెంట్ వి.కామేశ్వరరావు, దేవస్థానం ఏఈ అజయ్, చిన్న, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ గురువుకు సత్కారం

పెందుర్తి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పాతూరు జెడ్పీ హై స్కూల్ సోషల్ స్కూల్ అసిస్టెంట్ చీపురుపల్లి జగదీష్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎం.కిరణ్మయి సన్మానించి, అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సత్యప్రకాష్, రమేష్, శారద, మంగ, మాధురి, జగన్నాథరావు, ఏపీటీఎఫ్ కరుణాకర్, సన్నిబాబు, ఈశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ రాపేటి గణేష్ పాల్గొన్నారు.

- సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. ఉపాధ్యాయులను సత్కరించారు. జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప చంద్రకళ, అకడమిక్ ఇన్‌చార్జి సాయిబిందు పాల్గొన్నారు.
- స్థానిక గ్రంథాలయంలో సర్వేపల్లి జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విశ్రాంత బ్యాంక్ మేనేజర్ యు.వి.రావు, గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, పలువురు ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

పరవాడ: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని పరవాడ ఎంపీడీవో వి.హేమసుందరరావు అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సర్వేపల్లి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈవో సునీతతో పాటు సీనియర్ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.దివాకరరావు, జి.సాయి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎస్‌వీఆర్ మూర్తి, డి.శ్రీనివాసరావు, కె.రవి పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల్ని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఎంఈవోలు లక్ష్మణరావు, బోలెం సూర్యనారాయణ, ఉపాధ్యాయ సంఘ నేతలు ఆర్‌జీ గోవిందరావు, వనం భాస్కరరావు, హేమంత్ సుదేవ్, నాగిరెడ్డి అప్పారావు, తమ్మారావు, నాగరాజు పాల్గొన్నారు.

- సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు గురువుల పట్ల భక్తిభావంతో ఉండి, జ్ఞాన సముపార్జన చేయాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు అధ్యాపకులను సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ నివేదిత, డాక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

సబ్బవరం: మండలంలో గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి గెడ్డలు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట చేలు నీట మునిగాయి. ఆదిరెడ్డిపాలెం సమీపంలో గుల్లేపల్లి–సబ్బవరం రోడ్డులోని బ్రిడ్జిపై గెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సబ్బవరం మూడు రోడ్ల కూడలితో పాటు పోలీస్ స్టేషన్ ప్రాంతం వర్షపు నీరు చేరి ముంపునకు గురయ్యాయి. ఒమ్మువానిపాలెంలో రైవాడ కాలువకు గండి పడి, గ్రామానికి చెందిన గొంప ముత్యం తాటాకుల ఇల్లు నీట మునిగింది. పలు చోట్ల విద్యుత్ లైన్లు దెబ్బతిని, సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది.


ఆదిరెడ్డిపాలెం జంక్షన్ బ్రిడ్జిపై నుంచి గెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో నిలిచిన వాహనాలు